క్లుప్తంగా

శక్తి యాప్‌పై అవగాహన



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై, తదితరులు

జియ్యమ్మవలస: మండల కేంద్రంలో మహిళల రక్షణ, పోక్సో చట్టం, డ్రగ్స్, సైబర్ క్రైమ్‌లపై ఎస్‌ఐ ప్రశాంత్, శక్తిటీం సభ్యులు శుక్రవారం యువతకు అవగాహన కల్పించారు. శక్తి యాప్‌లో ఉండే 11 ఫ్యూచర్స్ వినియోగించే విధానాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ ఎల్ శ్రీనివాసరావు, హెచ్‌సీ రాంబాబు పాల్గొన్నారు.

కోటదుర్గమ్మ సేవలో పీఓ



కోటదుర్గమ్మను దర్శించుకుంటున్న ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పాలకొండ రూరల్: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని పాలకొండ సబ్ కలెక్టర్, సీతంపేట ఐటీడీఏ పీఓ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి కోటదుర్గమ్మను దర్శించుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రధానార్చకుడు లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సిబ్బంది పీఓను సంప్రదాయబద్ధంగా ఆహ్వానించారు.

రాఖీ సందడి..



రాఖీల కొనుగోళ్లలో నిమగ్నమైన అక్కచెల్లెమ్మలు

పాలకొండ రూరల్: ఏజెన్సీ కలబోసి ఉన్న పాలకొండ నియోజకవర్గంలో రాఖీ సందడి చోటుచేసుకుంది. అన్నా చెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల ఆప్యాయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పండగను శనివారం వేడుకగా నిర్వహించుకునేందుకు ప్రజలందరూ సిద్ధమయ్యారు. పట్టణంలో విరివిగా రాఖీ దుకాణాలు వెలిశాయి. రాఖీల కొనుగోళ్లతో శుక్రవారం స్థానిక ప్రధాన రహదారి సందడి మారింది. అన్ని వర్గాల వినియోగదారులను ఆకర్షించేందుకు సాధారణ దుకాణాల్లో వివిధ రకాల రాఖీలతో పాటు జ్యూయలరీ షాపుల్లో వెండి, బంగారు రాఖీలు దర్శనమిచ్చాయి.

సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

పాలకొండ: సెప్టెంబర్ 13,14 తేదీల్లో పాలకొండ పట్టణంలో నిర్వహించనున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణరావు పిలుపునిచ్చారు. పట్టణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం కార్మికులను వేధిస్తోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సీఐటీయూ పోరాటం చేస్తోందని చెప్పారు. ఈ నేపథ్యంలో చేపడుతున్న జిల్లా మహాసభలకు అన్నివర్గాల ప్రజలు హాజరు కావాలని కోరారు. సమావేశంలో వై. మన్మథరావు, బీవీ రమణ, కాద రాము, ఎ. లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

పాలకొండ రూరల్: అనుమతుల్లేకుండా తుపాకులు కలిగి ఉండడం నేరమని సీఐ మీసాల చంద్రమౌళి అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మైదాన ప్రాంతాల్లోని ఇళ్లల్లో తనిఖీలు నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలోని దోనుబాయి, బత్తిలి, సీతంపేట, వీరఘట్టం, పాలకొండ స్టేషన్ల ద్వారా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఎవరైనా నాటు తుపాకులు కలిగి ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై ప్రయోగమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

దోనుబాయి పోలీసుల ఆధ్వర్యంలో..

సీతంపేట: నాటు తుపాకులు కలిగి ఉంటే చర్యలు తప్పవని దోనుబాయి ఎస్సై షేక్ మస్తాన్ అన్నారు. కొత్తవలస పరిసర గ్రామాల్లో కార్డెన్ సెర్చ్ ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం నెలకొనేలా ప్రజలు సహకరించాలని కోరారు.



సీతంపేట: తనిఖీలు చేపడుతున్న పోలీసులు

ఎత్తిపోతలకు చేతులెత్తేశారు..!



సాగునీరు అందక రాజ్యలక్ష్మీపురంలో సాగుకు నోచుకోని పొలాలు

సాగునీరేది?



ఆగస్టు నెల వచ్చింది. ఇప్పటికీ జంఝావతి రిజర్వాయర్ ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు విడుదల చేయలేదు. అదిగోఇదిగో అంటున్నారే తప్ప పథక మోటార్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను బాగుచేయడంలేదు. అదును దాటిపోతున్నా సాగునీరు విడిచిపెట్టకపోవడం అన్యాయం. కూటమి నాయకులు స్పందించాలి. సాగునీరు విడుదలకు చొరవచూపాలి.

– నంగిరెడ్డి శరత్‌బాబు, వైస్ ఎంపీపీ, రాజ్యలక్ష్మీపురం, కొమరాడ మండలం

- వరినారు ముదురుతున్నా అందని సాగునీరు
- ఆవేదనలో రైతన్న
- కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంపై ఆగ్రహం
- తక్షణమే జంఝావతి ఎత్తిపోతల పథకం నుంచి నీరు సరఫరా చేయాలని డిమాండ్

కొమరాడ: జంఝావతి నదిపై 1975లో తలపెట్టిన ప్రాజెక్టు ఒడిశాతో ఉన్న చిన్నపాటి వివాదంతో నిలిచిపోయింది. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖరరెడ్డి కృషితో 2006లో జంఝావతిపై రబ్బర్‌డ్యామ్ ఏర్పాటైంది. సుమారు 12వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. అక్కడే లో లెవల్ కెనాల్ నుంచి కుడికాలువ పరిధిలోని సుమారు 1000 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకం నిర్మించారు. అప్పటి నుంచి ఏటా జూలై నెలలో ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు అందించేవారు. అయితే, ఈ ఏడాది వర్షాలు అనుకూలించకపోవడం, ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించేందుకు అధికారులు, పాలకులు చొరవచూపకపోవడంతో రాజ్యలక్ష్మీపురం, రావికర్రవలస, కుమ్మరిగుంట, కందివలస తదితర గ్రామాల్లోని భూములు సాగుకునోచుకోలేదు. ఓ వైపు వరినారు ముదిరిపోతున్నా ఎత్తిపోతల పథకం నుంచి సాగునీరు విడుదలకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకోకపోవడంపై రైతులు మండిపడుతున్నారు.



జంఝావతి ఎత్తి పోతల పథకం

ఎత్తిపోతల పథకంపై నిర్లక్ష్యం...

జంఝావతి ఎత్తిపోతల పథకం నిర్వహణపై నిర్లక్ష్యం చూపుతున్నారన్నది రైతుల వాదన. మరమ్మతులకు గురైన మోటార్లను సకాలంలో బాగుచేయకపోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలతను తొలగించకపోవడం వల్లే ఎత్తిపోతల పథకం నుంచి నీరు ఇప్పటికీ విడిచిపెట్టలేదని ఆరోపిస్తున్నారు. గతంలో ఈ పరిస్థితి ఉండేదికాదని, పథకంలో ఏ సమస్య ఎదురైనా వెంటనే పరిష్కరించేవారని చెబుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కనీసం రైతుల గురంచి, పంటల సాగు గురించి పట్టించుకోవడంలేదని వాపోతున్నారు.

ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఏర్పాట్లు

సీతంపేట: మండల కేంద్రంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో శనివారం నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా చేస్తున్నారు. ఐటీడీఏ ముఖద్వారం వద్ద ఉన్న అడవితల్లి విగ్రహానికి మెరుగులుదిద్దడంతో పాటు ఐటీడీఏ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. అలాగే ప్రభుత్వ స్టాల్స్ ఏర్పాటు చేయడానికి అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకుంటున్నారు. కార్యక్రమంలో భాగంగా అడ్వంచర్ పార్క్ నుంచి ర్యాలీ నిర్వహించడంతో పాటు అడవితల్లి విగ్రహానికి గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శనలుంటాయి. అలాగే టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్‌లలో ప్రతిభావంతులైన విద్యార్థులను సత్కరించనున్నారు.



అడవితల్లి విగ్రహానికి మెరుగులు దిద్దుతున్న చిత్రకారుడు



ఆదివాసీ దినోత్సవం నిర్వహణకు వేసిన టెంట్లు

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో శనివారం నిర్వహించనున్న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని గిరిజన జేఏసీ నాయకులు బి.గౌరీశంకరరావు, ఎన్.శేఖర్, బిడ్డిక నాగేశ్వరరావు, శంకరరావు, మండంగి రమణ, తదితరులు గిరిజన ప్రజలకు పిలుపునిచ్చారు.

గుమ్మలక్ష్మీపురంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. ఉత్సవంలో గిరిజన సంప్రదాయం ఉట్టిపడేలా ప్రదర్శనలు ఇవ్వాలన్నారు. డప్పు వాయిద్యాలతో రావాలని గిరిజనులకు సూచించారు.



మాట్లాడుతున్న గిరిజన జేఏసీ నాయకులు

మ్యూజియం పనుల్లో కదలిక



అర్ధంతరంగా ఆగిన మ్యూజియం పనులు



గిరిజన మ్యూజియం ఏర్పాటు చేయనున్న పాత పీఎంఆర్‌సీ భవనం

- తాజాగా కోటి రూపాయలు విడుదల

సీతంపేట: కొన్నేళ్లుగా నిలిచిపోయిన గిరిజన మ్యూజియం పనుల్లో మళ్లీ కదలిక రానుంది. 2017లో స్థానికంగా ఉన్న పాత పీఎంఆర్‌సీ భవనాల్లో గిరిజన మ్యూజియం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. మన దేశంలోని వివిధ రాష్ట్రాల్లో ఉన్న గిరిజన సంస్కృతీ, సంప్రదాయలతో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న వాటిని మేళవింపు చేసి ఆకట్టుకునేలా మ్యూజియాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలో దాదాపు కోటి రూపాయల వరకు అప్పట్లో వెచ్చించినప్పటికీ ఎటువంటి పనులు పూర్తి కాలేదు. కేవలం నాణేల సేకరణతో పాటు భవనాల్లోని గదుల పునర్నిర్మాణ పనులు వంటివి చేశారు. విద్యుత్ పనులు కూడా దాదాపు పూర్తి చేశారు. ఇదిలా ఉంటే భవనాల్లో ఏర్పాటు చేసిన కొన్ని ఏసీలను దొంగలెత్తుకుపోయారు. అయితే తాజాగా ఈ మ్యూజియానికి కోటి రూపాయలు మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్టు సమాచారం. అలాగే అడ్వంచర్ పార్కు నిర్మాణానికి సైతం రూ.1.50 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ నేపథ్యంలో పనులు ఏమేరకు పూర్తవుతాయో వేచిచూడాలి మరి.

చెత్త నుంచి సంపద సృష్టి ఎక్కడ..?

జియ్యమ్మవలస రూరల్: చెత్త నుంచి సంపద సృష్టించి రాష్ట్రాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేస్తామని చెప్పిన కూటమి ముఖ్యమంత్రి మాటలు నీటి మూటలుగానే మిగిలిపోయాయి. మండలంలో ఏ పంచాయతీలో చూసినా కంపుగొట్టే పరిస్థితి నెలకొంది. పారిశుద్ధ్య పనుల నిర్వహణకు నిధులు లేకపోవడంతో ఎక్కడ చెత్త అక్కడే దర్శనమిస్తోంది. డంపింగ్‌యార్డులకు చేరాల్సిన చెత్త ఊరు బయట కుప్పలుగా కనిపిస్తోంది. అధికారులు స్పందించి చెత్తను డంపింగ్‌యార్డులకు తరలించి సంపద సృష్టించి పంచాయతీలను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

గిరిజన భవనం కోసం స్థలం పరిశీలన



ఎల్విన్‌పేటలో గిరిజన భవనం కోసం ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న గిరిజన నాయకులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలో గిరిజన భవనం నిర్మించేందుకు అవసరమైన స్థలాన్ని గిరిజన నాయకులు ఎల్విన్‌పేటలోని ఖాళీ స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా నాయకులు బిడ్డిక నాగేశ్వరరావు, పాడి సుదర్శనరావు, నిమ్మక సింహాచలం, పత్తిక ప్రసాదరావు, శంకరరావు, ఎల్విన్‌పేట సర్పంచ్ ఆర్.ఎస్ చైతన్య స్రవంతి మాట్లాడుతూ గుమ్మలక్ష్మీపురంలో ఆదివాసీల కార్యకలాపాలు నిర్వహించుకునేందుకు గిరిజన భవనం మంజూరు చేయాలని పార్వతీపురం ఐటీడీఏ పీఓ అశుతోష్ శ్రీ వాస్తవకు విన్నవించామన్నారు. స్థలం గుర్తిస్తే భవన నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు స్థలాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. రెవెన్యూ అధికారుల సమక్షంలో ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌కు ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించామని, స్థల విషయాన్ని పీఓ దృష్టికి తీసుకెళ్తామన్నారు.



పాలకొండ: కోటదుర్గ ఆలయంలో సామూహిక కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

వరలక్ష్మీ నమోస్తుతే..

కోరిన కోర్కెలు తీర్చే తల్లి..సౌభాగ్యాన్ని ప్రసాదించే శ్రావణ లక్ష్మి అమ్మవారికి మహిళలు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాల్లో, ఇళ్లల్లో వరలక్ష్మీ వ్రతాలు చేపట్టారు. వేకువజాము నుంచే ఆలయాలకు భక్తులు చేరుకుని అమ్మవారిని దర్శించుకుని, గోత్రనామాలతో పూజలు చేశారు. అలాగే సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. పాలకొండ కోటదుర్గ ఆలయంలో ప్రధానార్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో.. వీరఘట్టం కోటదుర్గ, పైడితల్లి ఆలయాల్లో ప్రముఖ యజ్ఞకర్త శర్మయాజీ ఆధ్వర్యంలో విశేష పూజలు జరిగాయి. – సాక్షి నెట్‌వర్క్



వీరఘట్టం: భక్తులచే పూజలందుకుంటున్న కోటదుర్గ



వీరఘట్టం: శర్మయాజీ ఆధ్వర్యంలో కోటదుర్గ ఆలయంలో కుంకుమ పూజలు



జియ్యమ్మవలస: వెంకటరాజపురంలో వరలక్ష్మీ పూజ



బత్తిలి: సంతోషిమాత ఆలయంలో బారులు తీరిన భక్తులు



గరుగుబిల్లి: అలంకరణలో వరలక్ష్మీ అమ్మవారు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు సరికాదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరరావు

పాలకొండ రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల అన్నివర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జల ఈశ్వరరావు అన్నారు. పాలకొండలో పార్టీ మహాసభ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావుతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉత్తరాంధ్ర పరిధిలోని పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్ట్‌లను గాలికి వదిలేయడంతో ఈ ప్రాంతవాసులు ఆర్థికంగా వెనుకబడ్డారన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటును నాటు వ్యతిరేకించిన టీడీపీ నాయకులు నేడు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ శక్తులతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేసుకోకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ.. ఈనెల 23 నుంచి 25వ తేదీ వరకు గుంటూరు నిర్వహించనున్న మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు స్థానిక కోటదుర్గమ్మ కూడలి నుంచి భారీ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో విజయగనరం, పార్వతీపురం మన్యం జిల్లాల కార్యదర్శులు ఒమ్మి రమణ, కూరంగి మన్మధరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు బుడితి అప్పలనాయుడు, తిరుపతిరావు, సీనియర్ న్యాయవాదులు ఉత్తరావిల్లి మురళీమోహనరావు, కండాపు ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.



మహాసభల్లో మాట్లాడుతున్న సీపీఐ ముఖ్యనాయకులు

ప్రజల దృష్టికి 'కూటమి' మోసాలు



భామిని: చిన్నదిమిలిలో బాబు మోసాలను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, తదితరులు

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

భామిని: చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. మండలంలోని చిన్నదిమిలి, పోలవరంలో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, నాయకులు పాశర్ల అప్పలనాయుడు, పిన్నింటి హరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. సూపర్ సిక్స్ హామీలు అమలు చేయకపోవడంపై నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాల్సిన బాధ్యత కూటమి నాయకులపై ఉన్నప్పటికీ, నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి వంటి పథకాల ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తోట సింహాచలం, బోదెపు శ్రీనివాసరావు, మజ్జి మోహన్‌బాబు, కొత్తకోట చంద్రశేఖర్, వలరౌతు వెంకటరమణ, పిన్నింటి భాగ్యలక్ష్మి, పతివాడ రవణమ్మ, పిరపక శ్రీను, బొడ్డేపల్లి ప్రసాద్, కార్యకర్తలు పాల్గొన్నారు.



జియ్యమ్మవలస రూరల్: కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రజలకు వెన్నుపోటు..

సీతంపేట: సీఎం చంద్రబాబు మోసపూరిత హామీలతో గద్దెనెక్కి, వాటిని అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని ఎంపీపీ బిడ్డిక ఆదినారాయణ అన్నారు. మండలంలోని కిరపలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు నెరవేర్చకపోవడంపై మండిపడ్డారు. ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి పథకాలను అటకెక్కించారన్నారు. హామీలపై ప్రశ్నిస్తే రెడ్‌బుక్ రాజ్యాంగం పేరిట కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ జిల్లా కన్వీనర్ హెచ్.మోహనరావు, నియోజకవర్గ ఎస్టీ సెల్ కన్వీనర్ నిమ్మక కాంతారావు, సర్పంచ్ సరస్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు మురళి, మోహన్, వేణుగోపాల్, బంగారయ్య, రమేష్, కూర్మారావు, చింతామని, భారతి, సుశీల పాల్గొన్నారు.



సీతంపేట: ప్రభుత్వ వైఫల్యాలు వివరిస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు

బాబు.. భయపెడితే తగ్గేదేలే..

జియ్యమ్మవలస రూరల్: చంద్రబాబు నాయుడు ఎంత భయపెట్టినా తగ్గేదేలేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కోట రమేష్‌నాయుడు అన్నారు. పిప్పలబద్ర గ్రామంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయకపోవడం వల్ల ఒక్కో కుటుంబం ఎంత నష్టపోయినదీ వివరించారు. హామీలు అమలు చేయని కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సంపత్‌కుమార్, లోలుగు నారాయణరావు, బలగ వెంకటరమణ, తాడేల మన్మధరావు, మురళి, తదితరులు పాల్గొన్నారు.